

నేడు జిల్లా ఉర్దూ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ కాన్ఫరెన్స్ ఈనెల 29న ఉదయం నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల (సాలేనాగయ్య) లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఇర్షాద్, జాకీర్ హుస్సేన్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ముల్లా జుబేర్ అహ్మద్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యాశాఖ అధికారుల మార్గదర్శకంతో ఉర్దూ విద్యారంగాన్ని పటిష్ట పరచాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఆ దిశగా ప్రతి ఉర్దూ ఉపాధ్యాయుడు సైనికుడిలా కృషి చేయాల్సిన అవసరం అసన్నమైందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ వస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ఉర్దూ ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు.

రహదారులకు మహర్దశ

105 గుంతల పనులకు ఆమోదం
రూ.15.52 కోట్లతో మరమ్మతులు
టెండర్ల నిర్వహణలో ఆర్అండ్‌బి కసరత్తు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని రహదారుల మరమ్మతులకు రంగం సిద్ధమైంది. జిల్లా ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ యంత్రాంగం రూ.15.52 కోట్లతో రెండు ప్యాకేజీలుగా 105 పనులను విభజించింది. టెండర్ల నిర్వహణ అనంతరం ఎంపిక చేసిన రహదారుల్లోని గుంతలను పూడ్చడానికి కసరత్తు చేస్తోంది. ఇటీవల టెండర్లను సైతం పిలిచింది. అక్టోబర్ నెలాఖరు నాటికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ కుదుర్చుకునే పనుల్లో నిమగ్నమైంది. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి రహదారుల్లోని గుంతలకు మరమ్మతులు చేయడానికి సిద్ధమైంది. జిల్లాలో ఆర్అండ్‌బి నాలుగు వేల కిలోమీటర్ల మేర రహదారులను కలిగి ఉంది. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. గత ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించిన నేపథ్యంలో రహదారులు గుంతలమయం కావడంతో తరుచుగా ప్రమాదాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం రూ.290 కోట్లతో రహదారుల్లోని గుంతలను పూడ్చాలని నిర్ణయించింది. జిల్లా ఆర్అండ్‌బి డిపార్టుమెంట్ 15.52 కోట్లతో 105 పనులను గుర్తించింది. ప్రభుత్వానికి అత్యసవర మరమ్మతుల కేటగిరీ కింద రూ.12.82 కోట్లతో 65 పనులు, ఇంటెన్సివ్ కేటగిరీ పరిధిలో రూ.2.70 కోట్లతో 40 పనులు చేపట్టాలని ప్రతిపాదనలు పంపించింది. కడప డివిజన్‌లో రూ.2.21 కోట్లతో 30 పనులు చేపట్టనుంది. అత్యసవర మరమ్మతుల కేటగిరీ కింద రూ.133 కోట్లతో 10 పనులు, ఇంటెన్సివ్ మరమ్మతుల కేటగిరీ కింద రూ.87,8 లక్షలతో 20 పనులు చేపట్టింది. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో రూ.7.90 కోట్లతో 41 పనులు చేపట్టింది. అత్యవసర పనుల కేటగిరీ కింద రూ.6.91 కోట్లతో 31 పనులు, ఇంటెన్సివ్ కేటగిరీ కింద రూ.98 లక్షలతో 11 పనులు చేపట్టింది. పులివెందుల డివిజన్‌లో రూ.5.32 కోట్లతో 33 పనుల్ని చేపట్టనుంది. అత్యవసర కేటగిరీ కింద రూ.4.55 కోట్లతో 24 పనులు, ఇంటెన్సివ్ కేటగిరీ కింద రూ.84 లక్షలతో తొమ్మిది పనులు చేపట్టనుంది. రోడ్ల మరమ్మతు పనులకు ఆమోదం లభించింది. ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ యంత్రాంగం టెండర్లను నిర్వహించింది.

కావ్య జగత్తులో విశ్వనరుడు 'జాషువా'



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజానికి ఉపయోగపడే కవిత్వాన్ని అందించిన జాషువా కావ్య జగత్తులో విశ్వనరుడని డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నవయుగ కవిచక్రవర్తి 'గుర్రం జాషువా' 129వ జయంతిని పురస్కరించుకుని 'గుర్రం జాషువా జీవితం, సాహిత్యం సందేశం' అనే అంశంపై శనివారం ఉదయం సాహిత్య కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా సంచాలకులు ఆచార్య జి.పార్వతి, వక్త డాక్టర్.చింతకుంట శివారెడ్డి, సిబ్బంది, పాఠకులు కలసి జాషువా చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమానికి ఆచార్య జి.పార్వతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్త చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యాభ్యాసం నుండే జాషువా అగ్రకులాల పిల్లల నుండి అవమానాలను ఎదుర్కొనేవాడని, అలా కులంపేరుతో అవమానించిన వారిపై జాషువా తిరగబడేవారని అన్నారు. 1910లో మేరీని వివాహమాడి మిషనరీ పాఠశాలలో మూడు రూపాయల జీతంతో తన వైవాహిక జీవితాన్ని ప్రారంభించిన జాషువా అనేకచోట్ల పనిచేసి చివరకు మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా సేవలం దించారన్నారు. అంటరానివాడని హిందువులు దూరంపెడితే, క్రైస్తవుడై ఉండి హిందూ మత సంబంధ రచనలు చేస్తున్నారని క్రైస్తవులు జాషువా కుటుం బాన్ని మతం నుండి బహిష్కరించారన్నారు. జాషువా సుమారు 36 గ్రంథాలను, అనేక కవితా ఖండికలను వెలువరించారన్నారు. ఆయన శాసన మండలి సభ్యులుగా 1964లో నియమితులయ్యారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యా లయం వారి కళాప్రపూర్ణ పురస్కారం, పద్మభూషణ పురస్కారం పొందారన్నారు. జాషువా కుమార్తె హేమలతా లవణం ఆయన జీవితానుభవాలను విశ్లేషిస్తూ 'మా నాన్నగారు' అనే పుస్తకాన్ని వెలువరించడంతోపాటు 'జాషువా ఫౌండేషన్' ఏర్పాటుచేసి 'జాషువా సాహిత్య పురస్కారం' అందజేస్తున్నారన్నారు. సభాధ్యక్షులు మాట్లాడుతూ జాషువాను దళితకవిగా కాకుండా విశ్వకవిగా చూడాలన్నారు. కార్యక్రమంలో వక్త డా.చింతకుంట శివారెడ్డిని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది సుమతి, రాణి, విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, జానమద్ది నాగరాజు, కుమారస్వామి, భూపతి రాయల్, కొత్తపల్లి రామాంజనేయులు, రాయల్ కరిముల్లా కలసి సత్కరించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు ఎన్. రమేశ్‌రావు, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, జానమద్ది విజయభాస్కర్, కందిమల్ల రాజారెడ్డి, మధుబాబు, వై.ప్రభా కరరెడ్డి, దామోదరమ్మ, పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పుత్తా పుల్లారెడ్డి, ఇంతియాజ్, మునికుమార్, భాస్కరరెడ్డి, శ్యామసుందరరెడ్డి పాల్గొన్నారు.

కులమత భేదాలు సమసి పోవాలి : జెవివి

జన విజ్ఞాన వేదిక, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో కవి కోకిల గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పకుమారి మాట్లాడుతూ గుర్రం జాషువా జయంతి సందర్భంగా స్మరించుకోవడం గర్వకారణం అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా రచించిన కవిత్వం గురించి అరగంటో ,గంటో మాట్లాడుకుంటే సరిపోదని, ఆయన రచించిన ప్రతి ఖండకావ్యాన్ని తరచి తరచి చూడాలని పేర్కొన్నారు. అప్పుడే ఆ పద్యాల సొగసు తెలుస్తుందని చెప్పారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమారస్వామి రెడ్డి మాట్లాడుతూ ఏ కవి అయితే సమాజాన్ని ఒక అడుగు ముందుకు తీసుకెళ్తాడో, అతన్ని మహాకవి అంటారని తెలిపారు. జన విజ్ఞాన వేదిక సమత విభాగం సభ్యురాలు అరుణ, డి.రుతు ఆరోగ్య మేరి మాట్లాడుతూ బలహీనవర్గాల పట్ల, దళితుల పట్ల ఆయన వేదన చెంది' గబ్బిలం' ఖండకావ్యం రచించారని చెప్పారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యురాలు సునీత,జెవివి నాయకులు వెంకటేశ్వర్లు, అరుణ డి. రుతు ఆరోగ్య మేరి, ఉపాధ్యాయులు రమేష్, జాస్మిన్, శశిరేఖ, జ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె :అంటరానితనం, కుల వివక్షలపై తీవ్రంగా పోరాడి నాటి అగ్ర వర్ణాల అధిపత్యానికి వ్యతిరేకంగా గళం విప్పి విశ్వకవి సామ్రాట్‌గా పేరు పొందిన మొదటి దళిత కవి గుర్రం జాషువా అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు పేర్కొన్నారు. గుర్రం జాషువా 120వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగలక్ష్మి, కళాశాల లైబ్రేరియన్ మాధవరావు, చరిత్ర శాఖ అధ్యాపకులు గంగాధర్, ఫిజికల్ డైరెక్టర్ తేజంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్న వర్గాలపై దాడులను నివారించాలి

ప్రజాశక్తి - కడప

నిమ్న వర్గాల ప్రజలపై వివక్ష, అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ హాలులో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారితోపాటు ప్రొద్దుటూరు డిఎస్‌పి భక్తవత్సలం, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీకి సంబంధించిన కేసుల్లో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలుతీసుకుంటున్నామని చెప్పారు. అలాగే వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిస్కరించాలని కమిటీ సభ్యులను, అధికారులను ఆదేశించారు. సామాజిక రుగ్మతలను దూరం చేసి అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ చేపడుతున్న చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతి నిధులను సమన్వయం చేసుకుని అట్రాసిటీ కేసులు నమోదుకాకుండా అవగాహన పెంచాలన్నారు. దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని అన్నారు. అనంతరం సంబంధిత కేసుల అంశాలను ఆయా శాఖల నుంచి హాజరైన విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులను జిల్లా రెవెన్యూ అధికారి వివరంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడప , బద్వేలు, పులివెందుల డివిజన్ల ఆర్‌డిఒలు డిఎస్‌పిలు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ వి. బ్రహ్మయ్య, ఎల్‌డిఎం జనార్దన్ పాల్గొన్నారు.

రక్తదాతల జిల్లాగా మారుద్దాం

ప్రజాశక్తి - కడప : జిల్లాను రక్తదాతల జిల్లాగా మారుద్దాం, ఇందుకోసం యువత 18 సంవత్సరాల తర్వాత ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. వి. సుదర్శన్ రెడ్డి అన్నారు. అక్టోబర్ 1న జాతీయ రక్తం దాన దినోత్సవం సందర్భంగా రక్తదాన ప్రచార సేవకుడు, ఐఆర్‌సి సీనియర్ సభ్యులు అబ్దుల్ రాయల్ కరీముల్లా రూపొందించిన రక్తదాన ప్రచార పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మన కడప జిల్లాను రక్త దాతలు జిల్లాగా మార్చడానికి కృషి చేయాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగి వేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవ పథకం యూనిట్-9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడప - పులివెందు రోడ్డు ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లను - తొలగించారు. రహదారికి ఇరువైపుల ఉన్న 15కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంగా భాగంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నామన్నారు. అందరం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు.

త్వరగా పక్కా గృహాలు నిర్మించుకోవాలి

ప్రజాశక్తి - సిద్ధవటం : గత ప్రభుత్వంలో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు డిసెంబర్ నెలలోగా పూర్తిచేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ జయసింహ పేర్కొన్నారు. శనివారం మండలకేంద్రంలోని గ్రామ సచివాలయంలో 'మన ఇల్లు - మన గౌరవం'పైప లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో కడప జిల్లా కలెక్టర్‌లో తోటి శివశంకర్ ఉత్తర్వుల మేరకు సమావేశం నిర్వహిస్తున్నామని, గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న సిద్ధవటం వెలుగుపల్లి, జంగాలపల్లికమ్మ పాలెం గ్రామాల్లో గత ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలు నిర్మించుకొని లబ్ధిదారులు డిసెంబర్ లోపల ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని పేర్కొన్నారు. పొదుపు సంఘాల్లో ఉన్న లబ్ధిదారులు గృహాలు కట్టుకోవడానికి రుణాలు తీసుకుని నిర్మించుకునేలా వెసులుబాటు కల్పిస్తున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జవహర్ బాబు, హౌసింగ్ ఎఇ చెన్నయ్య, ఉపాధి హామీ ఎపిఒ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భారతి డిజిటల్ అసిస్టెంట్ డేవిడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు గాలికి

ప్రజాశక్తి - కడప : రాష్ట్రవ్యాప్తంగా , జిల్లావ్యాప్తంగా విద్యార్థుల సమస్యలను పట్టిం చుకోకుండా టిడిపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎన్ఎస్‌యుఐ కడప జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం రాకముందు విద్యార్థుల శ్రేయస్సు కోసం ఒక మేనిఫెస్టో విడుదల చేసింది అన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రతివిద్యార్థికి చదువుకోవడానికి డబ్బులు వేస్తామని, విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పి మోసం చేసి అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఇప్పుడు పూర్తిగా హామీని మర్చిపోవడం సిగ్గుచేటు అన్నారు. దాదాపు రెండు సంవత్సరాల నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టి విద్యార్థుల జీవితాలతో టిడిపి ప్రభుత్వం ఆడుకోవడం దారుణం అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులు చదువుతున్న నివాస వసతి గృహ హాస్టల్లో కాస్మోటిక్, మెస్ చార్జీలు విడుదల చేయక విద్యార్థిని విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు అన్నారు. ఇప్పటికైనా టిడిపి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను తీర్చాలని, లేనిపక్షంలో అందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో మహేష్, బాషా పాలొగొన్నారు.

బిసి హాస్టల్‌లో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి - బద్వేల్

పట్టణంలోని ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాన్ని శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి వై జె. పద్మశ్రీ సందర్శించి తనిఖీ చేశారు. హాస్టల్ రూములు, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతూ హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో
'ఉక్కు' కోసం పోరాడదాం



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, యువతకు రోల్ మోడల్ షహీద్ భగత్ సింగ్ స్ఫూర్తితో విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కు కోసం పోరాడదాం అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా కడపలో ప్రభుత్వ ఐటిఐలో శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యువతకు ఒక రోల్ మోడల్ అయినటువంటి ఒక ఆదర్శ మూర్తి భగత్ సింగ్ విగ్రహం కడపలో ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. భగత్ సింగ్ రగిలే ఒక నిప్పు కణిక అని, యువత ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని పేర్కొన్నారు. 23 సంవత్సరాల వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కొయ్యను ముద్దాడిన ధీరుడు భగత్ సింగ్ అన్నారు. 'నా దేహం కన్నా దేశం గొప్పది' అని నినదించిన త్యాగశీలి భగత్ సింగ్ అన్నారు. చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడు భగత్ సింగ్ అన్నారు. ఆయన పోరాటపటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రధానంగా ఆయన స్ఫూర్తితో యువత ఉద్యోగ, ఉపాధి కోసం పోరాటాలలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. విభజన హామీలలో ప్రధానమైంది కడప ఉక్కు పరిశ్రమన్నారు. కరువుతో అల్లాడుతున్న వెనుకబడిన రాయలసీమలో వలసలు నివారణ జరగాలంటే ఉపాధి పరిశ్రమ ఏర్పాటే ప్రధాన లక్ష్యమన్నారు. అటువంటి కడప ఉక్కును కేంద్రం నిర్లక్ష్యం చేస్తున్నదివాన్నారు. ఓట్లు, సీట్లు ప్రాతిపదికన కడప ఉక్కు కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. ఇక్కడ చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు పోతున్నారని తెలిపారు. కడప ఉక్కు పై కేంద్రం శీతకన్ను వేసిందన్నారు. గడిచిన 5 సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వం కడప ఉక్కు కోసం కేంద్రాన్ని నిలదీసిన సందర్భంగా ఏది లేదన్నారు. కడప ఉక్కు కోసం రాబోవు రోజులలో దీర్ఘకాలిక ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. యువత పోరాటాలలో కలసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నాజర్, బాలాజీ, గణేష్, పవన్, ఆదాం, సయ్యద్ మౌలాలి, జనార్ధన్ పాల్గొన్నారు. **పిడిఎస్‌యు, పివైఎల్ ఆధ్వర్యంలో** కడప నగరంలో పిడిఎస్‌యు రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో షాహిద్ భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా యువజన నాయకుడు ముబారక్ బాష, పిడిఎఫ్ యు నగర నాయకులు గంగాధర్, మహేష్, చరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

బద్వేలు : భగత్ సింగ్ 117వ జయంతి కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో భగత్ సింగ్ జయంతి వేడుకలను డివైఎఫ్ఐ మహిళా కో - కన్వీనర్ ఎస్.కె. ఫాతిమా ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి మహిళలతో ఘన నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో భగత్ సింగ్ విగ్రహానికి డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్ ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ 1907 సెప్టెంబర్ 28న లాయల్పూర్ జిల్లా బంగా గ్రామంలో జన్మించిన భగత్ సింగ్ లాలా లజపతిరాయి, మహాత్మా గాంధీ పిలుపులను అందుకొని భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. నేడు భగత్ సింగ్ కోరుకున్న సమ సమాజం కాకుండా మతోన్మాద రాజ్యం రావడం బాధాకరమని ఇలాంటి తరుణంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఉపాధ్యక్షులు ఖలీల్ బాష, యువరాజ్, షబ్బీర్, పట్టణ నాయకులు మా పీర, చంద్రకళ, మాధవి, అరుణ, స్వీటీ పాల్గొన్నారు. పట్టణంలోని సిద్ధవటం రోడ్డులో ఆయన విగ్రహం వద్ద జయంతి ఉత్సవ కార్యక్రమం బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ, మహనీయుల ఆశయాల సాధన కమిటీల ఆధ్వర్యాన భరత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నానబాల వెంకటేశ్వర్లు, యోగివేమన యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు, మహనీయుల ఆశయాల సాధన కమిటీ గౌరవాధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, గురుమూర్తి, ఉపాధ్యక్షులు ఎస్.ఎ సత్తార్, సంజీవరెడ్డి, వెంకటరమణ, పట్టణ అభివృద్ధి కమిటీ కోశాధికారి వెంగళరావు, నాగార్జున, అల్లు మస్తాన్, రవి, నాగూర్ బాష పాల్గొన్నారు.

భగత్ సింగ్ గొప్ప దేశ భక్తుడు : పిసిసి

వేంపల్లె : దేహం కంటే దేశం మిన్న అని భావించి దేశం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ గొప్ప దేశభక్తుడని పిసిసి అధికార తులసిరెడ్డి కొనియాడారు. వేంపల్లెలో శనివారం సర్దార్ భగత్ సింగ్ 117 వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్ర పటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, సుబ్బరాయుడు, నాగరాజు, వినయ్, పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు యువతకు రోల్ మోడల్ షహీద్ భగత్‌సింగ్ అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ పేర్కొన్నారు. భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, భగత్‌సింగ్ బ్లడ్ డొనేట్ గ్రూప్ సభ్యులు కలిసి రక్తదానం చేశారు. అనంతరం భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, రోటరీ క్లబ్ సభ్యులు భారతి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కు కోసం పోరాడదాం అని డివైఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి తులసీశ్వర యాదవ్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 117 వ జయంతి సందర్భంగా శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేష్. శ్యామ్. కల్యాణ్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : రక్తదానం చేస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

స్వర్ణాంధ్ర విజన్‌లో భాగస్వాములవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్: యువత, విద్యార్థులు స్వర్ణాంధ్ర -2047విజన్ లో భాగస్వాములై మీ భవిష్యత్తును మీరే నిర్మించుకునేందుకు సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. శనివారం పబ్లిక్ గ్రీవెన్స్ హాలులో స్వర్ణాంధ్ర విజన్ -2047 పై విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. 36 మంది విద్యార్థులు వ్యాసరచన, 36 మంది వక్తృత్వ, 42 మంది డిబేటింగ్ పోటీలో పాల్గొన్నారు.

హామీలు వెంటనే నెరవేర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి-కాశినాయన



మాట్లాడుతున్న మనోహర్

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన నరసాపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు పెంచుతామని, ప్రతి మహిళకూ నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తల్లికి వందనం, రైతులకు రూ. 20 వేల సాయం గురించి పూర్తిగా మరిచి పోయారని వాపోయారు. వీటిని అమలు చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉచిత ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలో అసైన్మెంట్ కమిటీ జరగకుండానే విచ్చలవిడిగా భూ కబ్జాదారులు బినామీ పట్టాలు పొంది కొన్ని వందల ఎకరాలు స్వాహా చేశారని చెప్పారు. పేదలు ఇబ్బంది పడుతున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. వరికుంట్ల, ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె, మూలపల్లె గ్రామాలలో డబ్బులున్న రాబందులు భూమి కబ్జా చేసి పేదలను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైన కమిషన్ ఏర్పాటు చేసి కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం మండల నాయకులు పోలయ్య, కలసపాడు మండల నాయకులు ప్రవీణ్, పోరుమామిళ్ల నాయకులు వీరయ్య, కార్యకర్తలు బాబు, లక్ష్మయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యే లక్ష్యం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇంజినీరింగ్ 2,3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆంగ్లభాషపైన, ప్రాంగణ ఎంపికల్లో పట్టు సాధించడం కోసం నిష్ణాతులైన వారిచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని పోత్సహిస్తున్నామన్నారు. పిల్లల బలాలు, బలహీనతలు తెలుసుకుని వారి ఉజ్వల భవిష్యత్‌కు తల్లిదండ్రుల సమావేశం ఎంతగానో ఉపయోగపడుతునందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపక, సిబ్బంది, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

క్రీడలతోనే శారీరక దృఢత్వం



మాట్లాడుతున్న జోజిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని కందుల విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కెఎల్ఎమ్ ఇండోర్ స్టేషన్‌లో బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడ ఆడే వాళ్ళు ఎక్కువ కాలం జీవిస్తారని ఒక సర్వేను ఉటంకిస్తూ తెలిపారు. తమ ఇండోర్ స్టేడియంలో ఉన్న వసతులను క్రీడాకారులు సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్య అతిథి, జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ కార్య దర్శి బి.జోజి రెడ్డి మాట్లాడుతూ ఎంపికల్లో బాగా రాణించి యూనివర్సిటీ టీంలో స్థానం పొందాలని పిలుపునిచ్చారు. కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలి పారు. కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. రత్నమ్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తద్వారా జీవితంలో స్థిరపడతారని పేర్కొన్నారు.

నిరసనాగ్రహం

ప్రజాదృష్టి

జిల్లాలో కూటమి సర్కారు తీరుపై సర్వత్రా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వైసిపి సర్కారు హయాంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కడప, విశాఖపట్నం జిల్లాలకు ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కులను కేటాయించింది. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ యువతకు నైపుణ్యాలను పెంచాలనే ఉద్దేశంతో ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కులను కేటాయించింది. వైసిపి సర్కారు జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసింది. 19.5 ఎకరాలను కేటాయించింది. కూటమి సర్కారు కొప్పర్తి ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కును సిఆర్‌డిఎకు తరలిస్తూ జిఒ జారీ చేయడంపై విమర్శల వర్షం కురుస్తోంది. జిల్లాలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, విద్యావంతులు, నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుటుంబంపై ఉన్న స్పర్థతో ఎటువంటి అభివృద్ధి పనులు చేయడం లేదనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఆయన మాటలు, చేతలను గమనిస్తే స్పష్టమవుతోందనే విమర్శలు ఉన్నాయి. కడప జిల్లాకు కొత్త ప్రాజెక్టులు ఇవ్వడం ఎవరికి ఎరుక, ఉన్న ప్రాజెక్టులను తన్నుకుపోవడం ఏవిధమైన రాజకీయమో ఆలోచించుకోవాలి. వివక్షా పూరిత వైఖరి ప్రజాస్వామ్యంలో మనజాలదనే సంగతిని గ్రహించాలి. సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లా పర్యటనల సందర్భంగా కడప జిల్లాలో టిడిపికి ఒక్క ఎమ్మెల్యేను మాత్రమే గెలిపించారని పదేపదే ప్రస్తావన చేయడం తెలిసిందే. వివక్షా పూరిత రాజకీయాల కారణంగానే ఇటువంటి ఫలితాలు వచ్చాయనే సంగతిని తెలిసి నటిస్తున్నారో, లేక జిల్లా ప్రజలను ఉద్దేశపూర్వకంగా మోసగించే నాటకం ఆడుతున్నారో తెలియడం లేదు. కులాలకు అతీతంగా ఆలోచన చేసి ఓటేయాలని పలుమార్లు అభ్యర్థించిన సంగతి తెలిసిందే. వివక్షా పూరిత రాజకీయాలే కారణమని గ్రహించాలి. లేనిపక్షంలో గత ఎన్నికల్లో లభించిన ఆ ఒక్క అసెంబ్లీ సీటు కూడా లభించని దుస్థితి దాపురించే అవకాశం ఉంది. రాష్ట్ర రాజధానిపై మీకు ప్రేమ ఉంటే కొత్త ప్రాజెక్టులు తెచ్చుకుని అభివృద్ధి పరచాలి. అటువంటి ప్రయత్నం చేయకుండా ఇతర ప్రాంతాలకు, వెనుకబడిన ప్రాంతాలనే సంగతిని మరిచిపోయి. వాటికి కేటాయించిన ప్రాజెక్టులను తరలిస్తామనడం ఎంత వరకు సబబో ఆలోచించాలి. జిల్లాలోని టిడిపి, జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు సైతం ఎంఎస్ఎంఇ తరలింపును నిలువరించాలి. లేకపోతే ఇంతటితోనే రాజకీయ జీవితాన్ని మర్చిపోవాల్సి వస్తుందనే సంగతి గ్రహించాల్సిన అవసరం ఉంది. అసలే వెనుకబడిన జిల్లా. ఇటువంటి వెనుకబడిన జిల్లా నుంచి గతంలో కేంద్రం ఇచ్చిన ఎంఎస్ఎంఇ టెక్నాలజీ పార్కును తరలించాలనుకోవడం అవివేకమని గుర్తించాలి.

\- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రజలు

వైభవంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల కేంద్రమైన సింహాద్రిపురంలో వెలసిన శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో స్వామివారికి మండల ఆరాధన పురస్కరించుకొని శనివారం ప్రత్యేకపూజలు, కల్యాణం వైభవంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన వేద పండితులు శ్రీపురుషోత్తమ ఆచార్యులు, రంగాచార్యుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ రుక్మిణి సత్య భామ సమేత శ్రీవేణు గోపాలస్వామి కల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయం చుట్టూ ప్రదర్శన చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాద పంపిణీ ఆలయ నిర్వాహకులు చేపట్టారు.


కుక్కకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

రేబిస్ మరణాలు తగ్గించడమే లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని జమ్మలమడుగు మునిసిపల్ కమిషనర్ కె.వెంకట రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ యాంటీ రాబిస్ దినోత్సవం సందర్భంగా నగర పంచాయతీలో వీధి కుక్కలకు రాబిస్ వ్యాక్సినేషన్ను ప్రభుత్వ పశు వైద్యశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శ్రీధర్రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. 2030 నాటికి మనుష్యుల్లో రేబిస్ మరణాలు లేకుండా చూడడమే మన ముందున్న లక్ష్యమన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ టికె మధుకుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల: ప్రపంచ రేబీస్ వ్యాధి దినోత్సవం సందర్భంగా ఎర్రగుంట్ల ప్రాంతీయ పశు వైద్యశాలలో పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.మునెయ్య ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి టీకాలు వేశారు. ముఖ్యఅతిథిగా ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ పి.శేషఫణి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రేబీస్ వ్యాధికి చికిత్స లేదన్నారు. టీకా వేయించడం ద్వారానే అరికట్టవచ్చని తెలిపారు. కమిషనర్ పి.శేషఫణి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, త్వరలో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. చిలమకూరు పశు వైద్యాధికారి డాక్టర్ మహేశ్వర్రెడ్డి, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడప అర్బన్: ప్రపంచ రాబిస్ డే దినోత్సవం సందర్భంగా వీధి కుక్కలకు రాబిస్ ఇంజక్షన్ల ఇచ్చే కార్యక్రమం శనివారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నోడల్ వీధి కుక్కలకు, స్థానిక కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ వేశారు. ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు చేశారు. రాబిస్ దాని తీవ్రత, లక్షణాలు, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక వెటర్నరీ డాక్టర్ల ద్వారా వివరణాత్మకమైన ఉపన్యాసాలు. రాబిస్పై అవగాహన పెంచడం కోసం ఉపయోగించే పదార్థాలు, బ్రోచర్లు ఫ్లైయర్లు ఆవిష్కరించారు. పిల్లల కోసం రాబిస్ నివారణపై ప్రశ్నోత్తరాల సదస్సులు, ఆటలు నిర్వహించడం. కుక్కలకు శ్రేయస్సు గురించి సమాచార బోర్డులు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించి, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ నందన్ అన్నారు.

ఖాజీపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ రేబిస్ డే సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అరుణకుమారి, కృష్ణప్రియ, శోభన్బాబు, కేశవయ్య, స్టాఫ్ నర్స్ సుప్రజ, హెల్త్ అసిస్టెంట్ విజయ భాస్కర్, మోహన్ కృష్ణ, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు: పెంపుడు జంతువులకు టీకాలు వేయించడం ద్వారా రేబిస్ వ్యాధిని నివారించవచ్చని మండల వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మహదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, ఫార్మసిస్టు సుభాషిని, స్టాఫ్నర్స్ సావిత్రి, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లె: కుక్క కరిచిన వెంటనే ప్రథమ చికిత్స చేయించుకొని ఎఆర్వి ఇంజక్షను వేయించుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం సూచించారు. మండలంలోని తాళ్ళపల్లె ఎస్సీ కాలనీలో రేబిస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటరత్నం, సూపర్వైజర్లు వెంకటలక్ష్మి, అరుణదేవి, ఎఎన్ఎం జ్యోతి, ఆశా పాల్గొన్నారు.

డిక్లరేషన్కు భయపడే జగన్ పర్యటన రద్దు

ప్రజాశక్తి - చాపాడు

డిక్లరేషన్కు భయపడే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీవారి దర్శనానికి హిందువులతోపాటు అన్య మతస్తులు ఎందరో తిరుమలకు నిత్యం రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆ ప్రకారమే టిటిడి ఇఒ కూడా డిక్లరేషన్పై సంతకం చేయాల్సిందిగా కోరారన్నారు. కాని జగన్మోహన్రెడ్డి శ్రీవారి దర్శనానికి వెళితే డిక్లరేషన్పై సంతకం చేయాల్సి వస్తుందని ఆ పర్యటనను రద్దు చేసుకొని ప్రభుత్వంపై నిందలు మోపడం సబబు కాదన్నారు.

'బీరం' కళాశాల విద్యార్థికి బంగారు పతకాలు

ప్రజాశక్తి - ఖాజీపేట


వేముల మునిచైతన్య

అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు ప్రభుత్వ కళాశాలలో ఎస్జిఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-19 తేక్వాండో, రెజిలింగ్ క్రీడల్లో బీరం జూనియర్ కళాశాల కడప, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి వేముల మునిచైతన్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించారని ఆ కళాశాల అధినేత బీరం సుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విజేత వేముల మునిచైతన్యను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, కళాశాల కడప ప్రిన్సిపల్ బషీర్ అహ్మద్, వైస్ ప్రిన్సిపల్ సుధా రాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పక తీసుకోవాలి

ప్రజాశక్తి - వేముల


పోషకాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

పోషకాహారం తప్పక తీసుకోవాలని ఐసిడిఎస్ సిబ్బంది సూచించారు. పెద్ద జూటూరు అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత నివారణకు మంచి ఆహారం తీసుకోవాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిషోర్ బాలికలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు, పంచాయతీ సెక్రెటరీ, ఆశ, ఎఎన్ఎం, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి పాల్గొన్నారు.

పులివెందులలో వరుస దొంగతనాలు

ప్రజల్లో భయాందోళనలు - పోలీసులకు సవాలుగా మారుతున్న వైనం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్ఫొటో)

వరుస దొంగతనాలతో పులివెందుల పట్టణ ప్రజలు భయాందోళనలో బతుకుతున్నారు. దొంగతనాలు ఆగే పరిస్థితి కనిపించకపోవడంలేదు. వాటిని అరికట్టడంలో పోలీసులకు సవాల్గా మారింది. ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మూడు నెలల నుంచి దాదాపు 20 దొంగతనాలు జరిగాయి. చిన్న దొంగతనాలు నుంచి భారీ దొంగతనాలు జరిగాయి. కర్నూలు డిఐజి, ఎస్పి రంగంలోకి దిగిన తర్వాత కూడా దొంగతనాలు జరగడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన వారిని విచారించారు. అయినా దొంగతనాలు జరుగుతున్నాయంటే ఈ దొంగతనాలు ఇతర రాష్ట్రాల వారి పని కాదు స్థానికుల వ్యవహారమే అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు తెలిసిన వారికి మాత్రమే ఇవ్వాలని, ఆధార్కార్డు తీసుకుని లాడ్జిల్లో రూములు ఇవ్వాలని పోలీసులు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో కూడా దొంగలు మాత్రం పగలు, రాత్రి అనే తేడాలేకుండా.. ధనిక, బీద తారతమ్యాలు లేకుండా దోచుకుంటున్నారు. చిన్న, పెద్ద దుకాణాల్లో కూడా చోరీలు జరుగుతున్నాయి. పోలీస్ ఇళ్లను కూడా టార్గెట్ చేసి దొంగతనాలు చేయడంతో అర్థం కాని అయోమయంలో పోలీసులున్నారు. గత నెల 13న ప్రభుత్వ బ్రాందీ షాప్లో రూ.4.5 లక్షలు, ఈ 22న విజయ హోమ్స్లో దాదాపు రూ.70 లక్షల దొంగతనం జరిగింది. దీనిపై కర్నూలు డిఐజి, ఎస్పి పులివెందులకు వచ్చి డిఎస్పి మురళి నాయక్, పోలీస్ సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. ఆ మేరకు పోలీసులు పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షించినా లాభం లేకపోయింది. ఈనెల 26న ఒక గోడౌన్లో రూ.10 లక్షలు చేసే సామగ్రిని దొంగలించారు. ఈనెల 27 సాయంత్రం రాఘవేంద్ర వీధిలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేయడానికి ప్రయత్నించగా, సమయానికి యజమాని రావడంతో దొంగలు పరారయ్యారు. ఇవన్నీ చూస్తూ ఉంటే దొంగలు స్థానికులై ఉంటారని రచ్చ బండల దగ్గర బహిరంగంగా చెప్పుకుంటున్నారు. దొంగలే దొంగతనాలు చేస్తున్నారా లేక చేయిస్తున్నారా అనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి.

మట్కా, గ్యాంబ్లింగ్ దొంగతనాలకు కారణమా..

మట్కా, గ్యాంబ్లింగ్ వరుస దొంగతనాలకు కారణమని పట్టణంలో బహిరంగ చర్చ జరుగుతోంది. దొంగతనాలు ఆగాలంటే మట్కా, గ్యాంబ్లింగ్ను రూపుమాపాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసులు రాజకీయ ఒత్తిడిల వల్ల వీటిపై అడపాదడపా పూర్తిస్థాయిలో నియంత్రించడానికి సాహసం చేయలేకపోతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వ్యసనాలకు బానిసలై డబ్బులు పోగొట్టుకొని దొంగతనాల వైపు వెళుతున్నారనేది కూడా ఉంది. పలు దొంగతనాల కేసుల్లో పట్టుబడినవారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నారు. ఇటీవల కడప ఎమ్మెల్యే మాధవి కడప పట్టణంలో గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయని బహిరంగంగానే పేర్కొన్నారు. మత్తు పదార్థాలను నియంత్రించి యువతకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికైనా పోలీసులు అసాంఘిక కార్యకలాపాలపై దాడులు చేసి నియంత్రిస్తే కొంతవరకైనా దొంగతనాలు తగ్గుతాయని పలువురు సూచిస్తున్నారు.

భయం గుప్పిట్లో ప్రజలు..

వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయం గుప్పెట్లో బతుకుతున్నారు. ఇల్లు వదిలి ఎక్కడికి పోవాలన్నా దొంగల భయం వెంటాడుతూనే ఉంది. కేవలం ఇళ్లనే టార్గెట్ కాకుండా వీధుల్లో వెళ్లే మహిళలపై కూడా దాడులు చేసి వారి దగ్గర ఉన్న బంగారు గొలుసులను దోచుకుంటున్నారు. బయటకు రావాలన్నా కూడా దొంగలతో భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఇలా లేదని ఇప్పుడు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అర్థంకాని అయోమయంలో ప్రజలు ఉన్నారు.

ఊర్లకు వెళితే సమాచారం ఇవ్వండి..

ఇంట్లో ఎవరూ లేకుండా తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిఎస్పి మురళినాయక్ సూచించారు. ఆ ఇళ్ల వద్ద నిఘా పెడతామన్నారు. ఇంటి వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. మాధ్యమాలు, పత్రికల ద్వారా పోలీసులు ప్రజలకు పలు జాగ్రత్తలను సూచిస్తున్నా.. దొంగలు మాత్రం చాకచక్యంతో వారి పని వారు చేసుకుంటున్నారు.

క్రమం తప్పని వ్యాయామం గుండెకు శ్రేయస్కరం

- గుండె వైద్యచికిత్స నిపుణులు డాక్టర్ పి.వెంకటచెంచయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



ఆధునిక సమాజంలో మారిన ఆహారపు అలవాట్ల వల్ల, మారిన జీవనశైలి ఫలితంగా యవ్వనంలో ఉన్నవారు కూడా గుండెపోటుకు గురవుతున్న అందోళనకర పరిస్థితులు తరచూ వింటూ ఉండడం విచారకరం. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్జాతీయ హార్ట్డే సందర్భంగా ప్రముఖ గుండె వ్యాధుల చికిత్స నిపుణులు డాక్టర్ పి.వెంకటచెంచయ్య గుండెపోటు కారణాలు, లక్షణాలు, అత్యవసర పరిస్థితుల్లో ఏమిచేయాలి అనే అంశాలపై 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే.. 'మనిషి శరీరంలో గుండె ముఖ్యమైన అవయవం. గుండె ఆక్సిజన్, పోషకాలను రక్తం ద్వార శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా చేస్తుంది. గుండె రక్తాన్ని సరిగా సరఫరా చేయలేకపోవడం వల్లే గుండెపోటు వస్తుంది. మధుమేహం, అధిక రక్తపోటు, అధిక బరువు, శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం, వృత్తిపరమైన, వ్యక్తిగత వత్తిడి, ధూమపానం, మద్యపానం, నిద్రలేమి వల్ల గెండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గుండెపోటు వచ్చినప్పుడు ఛాతిలో మంట, వీపు పైభాగం మంట, ఎడమ భుజం నుండి గొంతువరకు నొప్పి పాకడం, శరీరమంతా చెమటలు పట్టడం, గెండె దడ, ఆయాసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇతరుల సహాయం తప్పని సరిగా తీసుకోవాలి. ఎలాంటి తడబాటుకు గురికాకుండా నిదానంగా ఉండాలి. వేగంగా నడవడం చేయకూడదు. వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే ఇసిజి ద్వారా ధృవీకరణ జరుగుతుంది. రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో కొవ్వు పేరుకొని పోవడం వల్ల గుండెపోటు వస్తుంది. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వారు వీటిని తరచూ పరీక్ష చేయించుకుంటూ ఎల్లపుడూ నియంత్రణలో ఉంచుకోవాలి. ప్రతిరోజు అరగంట లేదా వారంలో 150 నిమిషాలు గాని శారీరక శ్రమ, వ్యాయామం చేయాలి. ప్రతి రోజు క్రమం తప్పక కనీసం అరగంటపాటు వ్యాయామం చాలా అవసరం. మారిన కాల పరిస్థితుల నేపథ్యంలో వృత్తి, వ్యక్తిగత వత్తిళ్లకు గురవుతున్నారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదు. వీలైనంత వరకు వత్తిళ్లకు దూరంగా ఉండాలి. ధూమపానం, మద్యపానం చేయరాదు. తాజా ఆకుకూరలు, పండ్లు మనం తీసుకునే ఆహారంలో భాగం కావాలి' అని డాక్టర్ పి.వెంకట చెంచయ్య సూచించారు.


మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా

స్కూల్ అసిస్టెంట్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా ఉన్నత పాఠశాల ప్లస్లో పనిచేస్తున్న పాఠశాల అసిస్టెంట్లకు పిజిటి డెసిగ్నేషన్, రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 294 హై స్కూల్ ప్లస్లను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను డిప్లయ్డ్ పిజిటిలుగా నియమించి ఒక ఇంక్రిమెంట్ మాత్రమే ఇచ్చి కంటి తుడుపు చర్యగా ప్రారంభించారని అన్నారు. ఇప్పటికీ రెండు సంవత్సరాలు పూర్తవుతున్న వారికి రెగ్యులర్ పిజిటిలుగా గుర్తించకపోవడంతోపాటు ఇంక్రిమెంట్ను రెగ్యులర్ స్కేల్లో కలపకపోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్బాబు, జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు, జిల్లా నాయకులు డి కృష్ణారెడ్డి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సి సుదర్శన్, మండల నాయకులు టివి రమణ, బత్తుల చంద్రశేఖర్, వన్నూరు భాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

యామవరం గ్రామ రైతు సేవా కేంద్రంలో శనివారం (మినికిట్స్) చిరు సంచుల పథకంలో భాగంగా ఎఒ వెంకటకృష్ణారెడ్డి రైతులకు ఉచితంగా పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వేముల

మండలంలో ఆదివారం 33 /11 కెవి పేర్నపాడు సబ్స్టేషన్లో 11కెవి చగాలేరు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆదివారం నుంచి మంగళవారం వరకు విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11కెవి సబ్స్టేషన్లో మరమ్మతులు చేస్తున్నందున ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల్లో ప్రజలు, రైతులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని జెఇ దినేష్ కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానికంగా వేధిస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని టిడిపి సీనియర్ నాయకులు కొండారెడ్డి తుంగ యాదవ్, మహ్మద్ రఫీ కమిషనర్ పి.శేషఫణిని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ పి.శేషఫణిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలను ఆయనతో చర్చించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

11 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్ఐటిలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 11 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు ఆర్జీయూకేటీ రిజిస్టర్ అమరేంద్ర కుమార్ తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన విద్యార్థులను శనివారం రిజిస్టర్ అమరేంద్ర కుమార్ అభినందించారు. ఫైనల్ ఇయర్ చదువుతున్న సిఎస్సి విద్యార్థులకు జోరియంట్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థులు ఎంపిక కావడం పట్ల డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, ప్లేస్ మెంట్ కో-ఆర్డినేటర్ కీతినేని వినోద్ హర్షం వ్యక్తం చేశారు.

స్కీం వర్కర్లు, కార్మికులు పాల్గొనాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈ నెల 30న కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జమ్మలమడుగు అధ్యక్షులు కార్యదర్శి జి ఏసుదాసు, దాసరి విజయ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంస్థలలో పనిచేసే స్కీం వర్కర్లు. కార్మికులకు ఉన్న సమస్యల పట్ల వారు కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎ.వినయ్. అబ్రహం. మమ్మద్ హుస్సేన్. శ్రీనివాసులు. పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మాల్కంబ్ పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు


మాల్కంబ్ క్రీడా పోటీల్లో మండల పరిధిలోని నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎల్ నరసింహ శాస్త్రి తెలిపారు. పాఠశాలకు చెందిన కె సునీల్, కె శ్రీదివ్య మాల్కంబ్ అండర్-17 విభాగంలో జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న డిప్యూటీ ఇఒ కృష్ణప్ప

బాలికల ఉన్నత పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ పాఠశాలల సందర్శనలో భాగంగా ప్రొద్దుటూరు డిప్యూటీ ఇఒ కృష్ణప్ప మండలంలోని ఎంపిపి పాఠశాల మెయిన్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక పాఠశాల మెయిన్ను సందర్శించి అక్కడి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు, శుభ్రత వాతావరణం చాలా బాగుందని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం చాలా బాగుందని కితాబు ఇచ్చారు. పాఠశాలలోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యా ర్థులతోపాటు సహఫంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ శివప్రసాద్ పాల్గొన్నారు.


అనిల్ను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

టిడిపిలోకి 39వ వార్డు కౌన్సిలర్ అనిల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మున్సిపల్ 39వ వార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్కుమార్ శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. నెహ్రూ రోడ్లోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఆయనకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు వ్యత్యాసం గమనించిన కౌన్సిలర్ అనిల్ టిడిపిలో చేరడం సంతోషకరమన్నారు. అనిల్ రాకతో ప్రస్తుతానికి వైసిపిని వీడి 14 మంది టిడిపిలో చేరారన్నారు. రానున్న రోజుల్లో 39వ వార్డును అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు మురళీధర్రెడ్డి, కమల్, ముక్తియార్, ఇవి సుధాకర్రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ ముకుందరెడ్డి తెలిపారు. మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం ముద్దనూరు రెండవ లేఔట్లో లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రవికుమార్, వెలుగు ఎపిఎం ఇబ్రహీం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం: మండల వ్యాప్తంగా అసంపూర్తిగా ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సన్నన్న సూచించారు. సింహాద్రిపురంలోని నూతన కాలనీలో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఇఒపిఆర్డి పద్మనాభ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శిరీష, వెలుగు ఎపిఎం మంజునాథ్, హౌసింగ్ ఇన్ఛార్జి ఎఇ లక్ష్మీకాంత్రెడ్డి, వర్క్ ఇన్స్పెక్టర్ చాంద్బాషా పాల్గొన్నారు.

పులివెందుల టౌన్: అసంపూర్తిగా ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చేపట్టిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రాముడు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి.వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.హాఫీజుల్లా హాజరయ్యారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ప్రమోద్కుమార్, రామాంజనేయులు, డ్వాక్రా మహిళలు, ఇంటి లబ్ధిదారులు పాల్గొన్నారు.

చాపాడు: అసంపూర్తిగా ఉన్న గృహాలను సకాలంలో నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి తెలిపారు. సోమాపురం, మొర్రాయిపల్లె గ్రామాల్లో మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025 మార్చి 31 నాటికి ఇళ్లను పూర్తిస్థాయిలో నిర్మించుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్రులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేముల: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద మన ఇల్లు - మన గౌరవం అనే కార్యక్రమం నిర్వహించారు. వేముల గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కృపానగర్ లేఔట్ను మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక ధృతి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవంతోపాటు ప్రపంచ హార్ట్డే సందర్భంగా ఆసుపత్రి గుండెవైద్య నిపుణులు పి.వెంకట చెంచయ్య, గైనకాలజిస్ట్ అనూష వల్లంకొండు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అపాయింట్మెంట్ కోసం 95020 04285ను సంప్రదించాలన్నారు.

నేడు పులివెందులకు మంత్రి సత్యకుమార్ రాక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం పులివెందులకు వస్తున్నారని బిజెపి నియోజకవర్గ పరిశీలకులు తెర మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం పార్నపల్లికు చేరుకొని ప్రజలతో కలుస్తారని తెలిపారు అక్కడి నుండి లింగాలకు వెళతారని తెలిపారు. ఉదయం 11గంటలకు పులివెందులలో బిజెపి జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి ఇంటికి చేరుకుంటారు.

ప్రొద్దుటూరు: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం ప్రొద్దుటూరుకు రానున్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ప్రముఖ డాక్టర్ వరుణ్కుమార్రెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం రాయల్కౌంటి రిసార్ట్స్లో పౌర సన్మానం ఉంటుందన్నారు.

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని నేరుసుపల్లె పంచాయతీ అప్పిరెడ్డిగారిపల్లి దళిత వాడకు చెందిన శివాజీపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఆర్కే వ్యాలీ సిఐ నాగరాజు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. అదే దళితవాడ గ్రామానికి చెందిన ఏడేళ్ల మైనర్ బాలికపై బలవంతం చేసినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, బాలికను కడప రిమ్స్కు పరీక్షల నిమిత్తం తరలించినట్లు తెలిపారు. కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాగునీటి ట్యాంక్ ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల సౌకర్యార్థం పూర్వ విద్యార్థులు, విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు చేసిన వితరణ గొప్పదని ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదివిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలకు విరాళంగా సౌండ్ సిస్టం, విద్యార్థులకు తాగునీటి కోసం రూ.లక్షతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్యుమెంట్లు పోయినవి

డాక్యుమెంట్ నెం.9476/2018/SRO/ PDTR రాచమల్లు జగదీశ్వరరెడ్డి, S/o రామక్రిష్ణారెడ్డి డోర్నెం.4-38, గరుడాద్రి నగర్, ప్రొద్దుటూరుకు చెందిన వారు పొట్టిపాడు రోడ్డు నుండి ప్రొద్దుటూరు టౌనుకు వెళ్తుండగా ఇంటి లింకు డాక్యుమెంట్లు పోయినవి. దొరికిన వారు క్రింది నెంబరుకు తెలుపగలరు.

సెల్: 8790626364.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, JAMMALAMADUGU

O.S.No. 307/2023

Vangala Siva Ramaiah, S/o V.Sreeramulu, aged 42 Years, Hindu, R/o.D.No.20/2/134, Darga Veedhi, Kanneluru (Vi), Jammalamadugu (M), Kadapa District. ...Plaintiff

Vs

Dussa Veera Brahmaiah, S/o D.Chinna Veeraiah, aged 52 years, Hindu, R/o D.No.26/1/394, Society Colony, Kanneluru (Vi), Jammalamadugu (M), Kadapa District. ...Defendants

నోటీసు

యీ నెంబరు దావాను వాది అయిన నేను ప్రతివాది పైన దావా బాకీ రాకోరి ఫైలు చేసివున్నాను. అట్టి దావా యందు ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ రాజశ్రీ కోర్టు యందు 30.09.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు హాజరయి తెలుపుకోవలసి వుంటూ వున్నది. అట్లు రాని యెడల నీ పరోక్షంన ఎక్స్పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 30.09.2024.

//By Order of the Court//

S. ZAKEER HUSSIAN
Advocate,
Jammalamadugu.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, JAMMALAMADUGU

O.S.No. 306/2023

Vangala Siva Ramaiah, S/o V.Sreeramulu, aged 42 Years, Hindu, R/o.D.No.20/2/134, Darga Veedhi, Kanneluru (Vi), Jammalamadugu (M), Kadapa District. ...Plaintiff

Vs

Dussa Veera Brahmaiah, S/o D.Chinna Veeraiah, aged 52 years, Hindu, R/o D.No.26/1/394, Society Colony, Kanneluru (Vi), Jammalamadugu (M), Kadapa District. ...Defendants

నోటీసు

యీ నెంబరు దావాను వాది అయిన నేను ప్రతివాది పైన దావా బాకీ రాకోరి ఫైలు చేసివున్నాను. అట్టి దావా యందు ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ రాజశ్రీ కోర్టు యందు 30.09.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు హాజరయి తెలుపుకోవలసి వుంటూ వున్నది. అట్లు రాని యెడల నీ పరోక్షంన ఎక్స్పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 30.09.2024.

//By Order of the Court//

S. ZAKEER HUSSIAN
Advocate,
Jammalamadugu.